క్లుప్తంగా

హెచ్చరిక బోర్డు ఏర్పాటు



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న వీఆర్‌వో అప్పారావు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు మంగమారిపేట జిల్లా పరిషత్ హైస్కూల్ సమీపంలో 314 సర్వే నంబరులోని ప్రభుత్వ భూమిలో అనధికారిక నిర్మాణాన్ని అధికారులు అడ్డుకున్నారు. గతంలో నిర్మాణం చేపట్టినప్పుడు దాన్ని పూర్తి స్థాయిలో తొలగించినప్పటికీ మరలా ఇటీవల పునర్నిర్మించారు. దీనిపై పలువురు భీమిలి తహసీల్దార్ వేణుగోపాల్‌కు ఫిర్యాదు చేయగా ఆయన ఆదేశాల మేరకు వీఆర్‌వో అప్పారావు బుధవారం భవన నిర్మాణం నిలిపివేసి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. మరలా బోర్డు తొలగించినా, నిర్మాణ పనులు కొనసాగించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం

కొమ్మాది: ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరి చేరవని జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము అన్నారు. జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ సోమన్నపాలెం ఎస్సీ కాలనీలోబుధవారం స్వచ్ఛ సర్వేక్షణ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఈ ప్రాంతంలో పర్యటించి తడి, పొడి చెత్త సేకరణ, పారిశుధ్య నిర్వహణపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకూడదని సూచించారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా చెత్త పన్ను చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహాలక్ష్మి నాయుడు, సూపర్‌వైజర్లు బడే అమ్మోరు, పైడిరాజు, హేమ, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

సుత్తమ్మతల్లికి ప్రత్యేక అలంకరణ



వేరుశనగ కాయల అలంకరణలో సుత్తమ్మ తల్లి

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ గ్రామదేవత సుత్తమ్మతల్లి విగ్రహాన్ని బుధవారం ఆలయ కమిటీ, భవానీ పీఠం ప్రతినిధులు వేరుశనగ కాయలతో అలంకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆషాడ మాసంలో అమ్మవారిని శాకాంబరీ దేవిగా పూజిస్తారన్నారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు.

గ్రంథాలయ భవనం ప్రారంభం

పద్మనాభం: మండలంలోని మద్ది పంచాయతీ తునిపాలెంలో మండల పరిషత్, జీపీజీఎఫ్ నిధులు రూ.5 లక్షలతో నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని ఎంపీపీ కంటుబోతు రాంబాబు బుధవారం ప్రారంభించారు. మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ తాలాడ సూరినాయుడు, బుగత సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి రఘుపతిరావు పాల్గొన్నారు.

శ్రీ కృష్ణావతారంలో జగన్నాథుడు



భీమునిపట్నం: జగన్నాథుని రథోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి వారు శ్రీకృష్ణావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వందలాది మంది భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆర్.సింగరాచార్యులు భక్తులకు ఈ అవతారం విశిష్టతను వివరించారు.

‘అమ్మ ఒడి’ పథకం దేశానికే ఆదర్శం

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- ‘జగనన్న సురక్ష’తో అందరికీ మేలు
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



చంద్రంపాలెం హైస్కూల్‌లో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



శొంఠ్యాం గ్రామంలో ‘అమ్మ ఒడి’ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

పీఎం పాలెం: దేశంలోని అన్ని రాష్ట్రాల కంటే అత్యంత నాణ్యమైన ప్రభుత్వ విద్యను అందించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గట్టి పట్టుదలతో కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ‘అమ్మ ఒడి’ పథకం నిధులను విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి సీఎం జగన్ జమ చేస్తున్న సందర్భంగా చంద్రంపాలెం ఉన్నత పాఠశాలలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా మధురవాడ జోన్ పరిధిలోని 4 వార్డుల్లో చదువుతున్న విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి ఇప్పటి వరకూ రూ.72 కోట్లు జమ చేశామన్నారు. అమ్మ ఒడి, నాడు – నేడు, జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ ద్వారా విద్యాభివృద్ధికి సీఎం జగన్ విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు.

బాలికా విద్యను ప్రోత్సహించడానికి తాగునీరు, మరుగుదొడ్లు వంటి సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. బాలికల భద్రత, దిశ చట్టంపై అవగాహన కల్పించేందుకు సెమినార్లు నిర్వహించాలని పోలీసు అధికారులకు, ఉపాధ్యాయులకు సూచించారు. పిల్లల భవిత కోసం కృషి చేస్తున్న సీఎం జగన్‌ను, తననూ అందరూ గుర్తించుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నగరాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిళ్లా సుజాత, జెడ్సీ కనక మహాలక్ష్మి, జీవీఎంసీ 5, 6, 7 వార్డుల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు పోతిన హనుమంతరావు, బొట్ట అప్పలరాజు, పోతిన శ్రీనివాసరావు, నాయకులు కె.వరలక్ష్మి, గాదె రోశిరెడ్డి, కృష్ణమూర్తి పాత్రుడు, వాండ్రాసి రవికుమార్, పోతిన ప్రసాద్, యల్లాజీ, పిళ్లా సూరిబాబు, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు

అంతర్జాతీయ స్థాయికి గ్రామీణ విద్యార్థులు

ఆనందపురం : గ్రామీణ ప్రాంత విద్యార్థులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలన్న ఏకైక లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యారంగంలో సమూల మార్పులు తీసుకొచ్చారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని శొంఠ్యాంలో బుధవారం నిర్వహించిన జగనన్న ‘అమ్మ ఒడి’ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు ఒకప్పుడు దుంపల బడులుగా ముద్ర పడ్డాయని, అక్కడకు పంపడమే దండగనే పరిస్థితి ఉండేదన్నారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలే మారిపోయాయన్నారు. నాడు – నేడు, విద్యా దీవెన, వసతి దీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్, జగనన్న విద్యా కానుక వంటి ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి నాలుగేళ్లలో విద్యా రంగానికి రూ.66 వేల కోట్లు ఖర్చు చేశారని కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభావంతులైన ఉపాధ్యాయలు ఉన్నారని, కార్పొరేట్ స్థాయిలో బోధిస్తూ ఉత్తమ ఫలితాలు సాధించడానికి కృషి చేస్తున్నారన్నారు. విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకొని ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్తే ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని సూచించారు. ఈ సందర్భంగా మండలంలోని 82 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 6,263 మంది విద్యార్థులకు ‘అమ్మ ఒడి’ పథకం కింద రూ.8.14 కోట్ల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం, ఎంపీపీ మజ్జి శారద ప్రియాంక, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, సర్పంచ్ లెంక లావణ్య, ఎంపీటీసీ సభ్యురాలు పల్లా దుర్గ, ఎంఈవో ఎస్ఎస్ పద్మావతి, సీనియర్ నాయకులు కాకర్లపూడి వరలహాల రాజు, వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, లెంక రాంబాబు, భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు, మజ్జి వెంకటరావు, కోరాడ వెంకట రమణారావు, పాండ్రంకి అప్పారావు, రౌతు శ్రీను, కోరాడ గిరిరాజు, డోల దేవుడు పాల్గొన్నారు.

90 మందికి నేత్ర వైద్య పరీక్షలు

ఆనందపురం : వేములవలసలోని శ్రీ వేంకటేశ్వరరావు పాఠశాలలో శ్రీ సత్యసాయి సేవా సంస్థల విశాఖ జోన్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో 90 మందికి పరీక్షలు చేశారు. వారిలో 10 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. మిగతా వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పాఠశాల కరస్పాండెంట్ గణేష్, జిల్లా కో – ఆర్డినేటర్ సత్యసాయి కుమార్, ఐ ఆస్పత్రి కో – ఆర్డినేటర్ సాయికృష్ణ, వేములవలస మాజీ సర్పంచ్ కోరాడ అప్పలస్వామి నాయుడు, గొట్టిపల్లి భజన మండలి కన్వీనర్ కె.తమ్మునాయుడు, డి.శరత్ కుమార్, లక్ష్మణమూర్తి, వరలక్ష్మి, గోపి పాల్గొన్నారు.

కుక్కల దాడిలో ఆవుదూడ హతం

తగరపువలస: భీమిలి మండలం లక్ష్మీపురం పంచాయతీలో బుధవారం కుక్కలు దాడి చేసి లచ్చుబుగత రమణకు చెందిన ఆవుదూడను తీవ్రంగా గాయపరచడంతో చనిపోయింది. ఈ ఆవు దూడ 20 రోజుల క్రితమే జన్మించింది. పంచాయతీలో ఇటీవల కుక్కలు విపరీతంగా పెరిగిపోయి రోజూ కోళ్లు, పశువులు, మేకలను తీవ్రంగా గాయపరచి తినేయడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుక్కల నియంత్రణకు పంచాయతీ పాలకవర్గం, అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు గిరిబాబు

పద్మనాభం: రైతుల సంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు అన్నారు. మద్ది గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో బుధవారం రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 16 రైతు భరోసా కేంద్రాల్లో వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. సాంబమసూరి 82 క్వింటాళ్లు, సోనమసూరి 403.5 క్వింటాళ్లు, ఎంటీయూ 1121 రకం 395.6 క్వింటాళ్లు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు సంబంధిత రైతు భరోసా కేంద్రాలకు ఆధార్ కార్డు పట్టుకుని వెళ్లి వేలి ముద్రలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ తాలాడ సూరినాయుడు, ఏవో ఎం.వి.ఎస్.చలం, నాయకులు బుగత సత్యనారాయణ, బుగత శ్రీనివాసరావు, బుగత ఎర్నాయుడు, ఈర్ల ఈశ్వరరావు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్యులతో పరీక్షలు చేయించాలి



చిప్పాడలో ఆరోగ్య సిబ్బందితో డాక్టర్ జగదీశ్వరరావు

తగరపువలస: హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారికి వైద్యులచే పరీక్షలు చేయించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లో భాగంగా బుధవారం ఆయన భీమిలి మండలం తాళ్లవలస పీహెచ్‌సీ పరిధిలోని చిప్పాడ పంచాయతీలో శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, సిబ్బందితో సమీక్ష జరిపారు. ఎన్‌సీడీ – సీడీ సర్వే నూరు శాతం అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఈ – ఆశ యాప్ ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. ఆయనవెంట డీపీఎంవో ఎన్‌హెచ్‌ఎం డాక్టర్ ఎస్.రామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం



సన్యాసిరావును సన్మానిస్తున్న ఎంపీపీ రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు గిరిబాబు

పద్మనాభం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్ద పీట వేసిందని ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు అన్నారు. మండలంలోని మద్ది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పని చేసి బదిలీ అయిన ఎం.సన్యాసిరావు, ఉపాధ్యాయులు కనకల సీతారాం, సంగు శ్రీనివాసరావు, తిరపతి రాజును కల్యాణ మండపంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి మంచి గుర్తింపు ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు కోరాడ లక్ష్మణరావు, సర్పంచ్ బుగత సన్యాసమ్మ, బాందేవుపురం కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు బుగత శ్రీనివాసరావు, కాళ్ల నగేష్ కుమార్, బుగత సత్యనారాయణ, డీసీఈబీ కార్యదర్శి ఎం.వి.కృష్ణ కుమార్, ఉపాధ్యాయ సంఘ నాయకులు ఆర్.జగదీష్‌బాబు, ఎ.అరుణ్ కుమార్, బి.సూర్యనారాయణ, ఎస్.నారాయణరావు పాల్గొన్నారు.

బంగ్లామెట్ట పాఠశాల పరిశీలన



ఛాత్రోపాధ్యాయులకు అవగాహన కలిగిస్తున్న డైట్ అధ్యాపకుడు త్రినాథరావు

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలను భీమిలి డైట్ అధ్యాపకుడు సారిపల్లి త్రినాథరావు బుధవారం పరిశీలించారు. అంతర్జాతీయ పేదల దినోత్సవం సందర్భంగా అసెంబ్లీ సమయంలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. మనిషి తీసుకునే పౌష్టికాహారం ఆధారంగా పేదలను గుర్తించవచ్చన్నారు. రోజుకు 2,250 కేలరీల కంటే తక్కువ ఆహారం తీసుకునే వారిని పేదలుగా గుర్తించాలన్నారు. దీని ఆధారంగా మనదేశంలో కోట్లాది మంది పేదలు ఉన్నారన్నారు. అనంతరం పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఛాత్రోపాధ్యాయులకు డైరీ రాసే విధానం, బోధనాభ్యసన సామగ్రి వినియోగంపై వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఆర్.అప్పలరాజు, ఉపాధ్యాయులు పి.నాగమణి, బి.మల్లిక, ఎస్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విష్ణు సహస్రనామ పారాయణ

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం తొలి ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ సింహ శైల సేవా సమితి ఆధ్వర్యంలో 500 మందితో శ్రీ విష్ణు సహస్ర నామ పారాయణ నిర్వహించనున్నారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం వరకు కొనసాగుతుందని, సాయంత్రం అన్నమాచార్య సంకీర్తనతో కోలాటం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

తగరపువలస: చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈఈ బొట్ట రవి తెలిపారు. ఈ అంతరాయం కారణంగా రాజుల తాళ్లవలస, లెజెండ్ లే అవుట్, గొల్లల తాళ్లవలస, ఎన్‌ఆర్ఐ డబుల్ రోడ్డు, సుఖీభవ కాలనీ, తిరుమల స్కూల్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

‘విద్యుత్ బిల్లులు నేడూ చెల్లించవచ్చు’

ఏపీఈపీడీసీఎల్ జోన్ – 3 మధురవాడ పరిధిలోని అన్ని రెవెన్యూ కార్యాలయాల్లో విద్యుత్ బిల్లుల వసూళ్ల కేంద్రాలు గురువారం బక్రీద్ పర్వదినం రోజున పనిచేస్తాయి. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.శ్రీనివాసరావు తెలిపారు.

ఆనందపురం : మండలంలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని సబ్ స్టేషన్ ఏఈఈ సురేష్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లకు మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా పెద్దిపాలెం, పల్లిపేట, మచ్చవానిపాలెం, బీపీ కళ్లాలు, పాడుగుపాలెం, చందక, గొట్టిపల్లి, వెంకటాపురం, జగన్నాథపురంలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు గమనించాలని కోరారు.

పన్ను బకాయి రూ.1.67 కోట్లు వసూలు

మధురవాడ: జీవీఎంసీ 8వ వార్డులో రెవెన్యూ విభాగానికి గీతం వర్సిటీ చెల్లించాల్సిన పన్ను బకాయి ఉన్న రూ.1.67 కోట్లు వసూలు చేసినట్టు జెడ్సీ కనక మహాలక్ష్మి బుధవారం చెప్పారు. పన్ను బకాయి చెక్కును అసిస్టెంట్ కమిషనర్ రమేష్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ముగడ రాజు, రమేష్ తదితరులు జెడ్సీకి అందజేశారు.

శిశుగృహ, ఐసీడీఎస్ కార్యాలయాల సందర్శన

మద్దిలపాలెం: ఆర్ అండ్ బీ జంక్షన్ వద్ద ఉన్న శిశుగృహ, ఐసీడీఎస్ కార్యాలయాన్ని బుధవారం ఆర్‌జేడీ చిన్మయిదేవి, పీడీ వెంకటేశ్వరి సందర్శించారు. శిశుగృహలో పలు దస్త్రాలను పరిశీలించారు. చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. ఐసీడీఎస్ కార్యాలయంలో ఇటీవలే నూతనంగా ఏర్పడిన సెక్టార్ విధివిధానాలను వారు అడిగి తెలుసుకున్నారు. అక్కడ నిర్వహించిన ప్రాజెక్ట్ సమావేశంలో అంగన్‌వాడీ సిబ్బంది పలు సూచనలిచ్చారు. అధికారుల వెంట అడిషనల్ సీడీపీవో శ్రీలత, సూపర్‌వైజర్లు కుమారి, వెనిష తదితరులు ఉన్నారు.

పరదేశిపాలెంలో గోర్జి పరిరక్షణకు చర్యలు

- భీమిలి ఆర్డీవో భాస్కరరెడ్డి



పరదేశిపాలెంలో భూములు పరిశీలిస్తున్న ఆర్డీవో భాస్కరరెడ్డి, ఇతర అధికారులు

మధురవాడ: విశాఖ రూరల్ మండలం పరదేశిపాలెంలోని ప్రభుత్వ గోర్జి స్థలాన్ని పరిరక్షించడానికి చర్యలు చేపడతామని భీమిలి ఆర్డీవో భాస్కరరెడ్డి చెప్పారు. పరదేశిపాలెంలో ఆక్రమణకు గురైన గోర్జి భూములను విశాఖ రూరల్ మండల తహసీల్దార్ ఎస్.రమణయ్యతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. ఇక్కడ చాలా వరకు ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురయ్యాయని, వాటిని పూర్తి స్థాయిలో రక్షించాలని గీతారెడ్డి అనే మహిళ కొంతకాలంగా ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకొస్తున్నారు. పలుమార్లు ‘స్పందన’లో ఆధారాలతోసహా ఫిర్యాదులు చేశారు. దీంతో గతంలో ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ లోకవరపు రామారావు ఆధ్వర్యంలో సర్వే నిర్వహించి ఆక్రమిత భూములకు మార్కింగ్ చేశారు. మరలా దీనిపై పూర్తి స్థాయిలో సర్వే చేసి ఆక్రమణదారులపై చర్యలు చేపట్టాలని ఆమె కోరడంతో అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా భాస్కరరెడ్డి మాట్లాడుతూ ఇక్కడ గతంలో సర్వే చేసి మార్కింగ్ చేశామని, పూర్తి స్థాయిలో చర్యల నిమిత్తం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ ఆధ్వర్యంలో బృందాన్ని నియమించి సర్వే చేయిస్తామని తెలిపారు. పరదేశిపాలెం రెవెన్యూ గ్రామం సర్వే నంబర్లు 37/12, 33/12, 33/1బి, 33/3బి, 33/4బి లలో గల భూములకు పూర్తి స్థాయిలో సర్వే చేసి ఆక్రమణలు తొలగిస్తామని తెలిపారు. అలాగే మధురవాడ రెవెన్యూ గ్రామం రిక్షా కాలనీలోని 6/1లో గల పార్కు స్థలంలో పట్టాలు ఇవ్వాలని స్థానికులు కోరగా గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు లోబడి ప్రభుత్వ పార్కు స్థలానికి పట్టాలు ఇవ్వడం సాధ్యం కాదని చెప్పారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో అలసత్వం ప్రదర్శించవద్దని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయనవెంట విశాఖ రూరల్ ఆర్ఐ మల్లేశ్వరరావు, సర్వేయర్ ఎస్.శ్రీనిబాబు, వీఆర్‌వో సూరిబాబు తదితరులు ఉన్నారు.

జగనన్నతోనే సంక్షేమ పాలన సాధ్యం



బాపూజీనగర్‌లో వృద్ధునికి సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమ పాలన, అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 7వ వార్డు నగరంపాలెం రోడ్డు సమీపంలో ఉన్న బాపూజీనగర్, ఆదిత్యనగర్ పరిసర ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని, ప్రభుత్వం ద్వారా జరిగిన మేలు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొందరు సినిమా డైలాగులతో కల్లబొల్లి కబుర్లు, మాయమాటలు చెబుతున్నరని, వాటిని నమ్మి మోసపోవద్దని కోరారు. ప్రస్తుత సంక్షేమ పథకాలతోపాటు కొత్తవి అమలు కావాలంటే అంతా సీఎం జగన్ వెంటే ఉండాలని పిలుపునిచ్చారు. పేదలందరికీ పూర్తి స్థాయిలో న్యాయం చేయాలనే సంకల్పంతో ఉన్నామన్నారు. ఎక్కడైనా అర్హులకు లబ్ధి జరగకపోతే జగనన్న సురక్ష ద్వారా మేలు చేసేందుకు కృతనిశ్చయంతో ఉన్నామన్నారు. ఈ సందర్భంగా పలువురు ఆయన దృష్టికి పలు సమస్యలు తీసుకొచ్చారు. వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, జెడ్సీ కనక మహాలక్ష్మి, డీఈ శ్రీహరి, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, కల్చరల్ వింగ్ రీజినల్ కో ఆర్డినేటర్ వంకాయల మారుతీప్రసాద్, సచివాలయాల వార్డు ఇన్‌చార్జి కుడితి రామారావు, రైల్వే బోర్డు మెంబర్ ఎస్.బాబ్జి ఎస్టీ సెల్ అధ్యక్షుడు పెంద్ర అప్పన్న, తమ్మినేని వరలక్ష్మి, లోహిత్, జగ్గపిల్లి నరేష్ తదితరులు పాల్గొన్నారు.